




ప్రకృతికి హితం.. పూజకు శ్రేష్ఠం

● రంగు రంగుల్లో కనువిందు చేస్తున్న మట్టి గణపతులు ● ఏకో ఫ్రెండ్లీ ప్రతిమలకే మొగ్గు

మరికొన్ని రోజుల్లో వినాయక చవితి సందడి మొదలుకానుంది. రంగురంగుల విగ్రహాల వైపు జనం ఆసక్తి చూపే జనం ఇప్పుడు మట్టి విగ్రహాల వైపు మొగ్గుచూపుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో జలకాలుష్యం జరుగుతుండడంతో ఏకో ఫ్రెండ్లీ గణపతుల వైపు ఆసక్తి కనబరుస్తున్నారు. మొదట్లో ఇళ్లల్లో పూజలందుకున్న మట్టి గణపతులు ప్రస్తుతం మండపాల్లో పెద్ద సైజుల్లో రంగురంగుల రూపాల్లో కొలువుదీరుతున్నారు. సిద్దిపేట పట్టణంలో చిన్నగుండవెల్లికి చెందిన రాములు లక్ష్మీ దంపతుల ఇద్దరు కొడుకులు మహేష్, రాజశేఖర్ మట్టి గణపతులను తయారు చేసి విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బీజేఆర్ చౌరస్తాలోని గోల్కొండ హస్తకళా నిలయంలో వరంగల్ నుంచి తెప్పించిన మట్టి గణపతులు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. సైజును బట్టి రూ.10 వేల నుండి 20 వేల వరకు అమ్ముతున్నారు. హ్యాండ్‌మేడ్ వినాయక ప్రతిమలు వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్నాయి.

- సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి)





స్వాహాకారం..!

- నిధులను కాజేశారు.. రికవరీని మరిచారు
- లక్షలాది రూపాయలు స్వాహా
- ఏళ్లు గడుస్తున్నా.. విచారణలో కాలయాపన
- రేపటితో పాలకవర్గ గడువు పూర్తి
- రాజకీయ జోక్యంతో వసూలు కాని బకాయిలు

జిల్లాలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాలు ఆర్థికంగా కుదేలవుతున్నాయి. ఒకప్పుడు రైతుల నుంచి పక్కాగా రుణాల రికవరీకి పేరుపొందిన ఈ సంఘాల్లో సగం వరకు ఇప్పుడు రాజకీయ జోక్యం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవినీతికి వేదికయ్యాయి. రుణాల పేరుతో, ఎరువుల అమ్మకాల పేరుతో భారీగా నిధులు స్వాహా అయ్యాయి. విచారణలో జాప్యం, రికవరీ చర్యలు చేపట్టక పోవడంతో వేల మంది రైతులు నష్టపోతున్నారు. రేపటితో ప్రస్తుత పాలకవర్గ గడువు ముగియనుండటంతో, ఈ అవినీతి వ్యవహారం ఎటువైపు వెళ్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- దుబ్బాక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి)



అంజుమాన్ బ్యాంక్ అంటేనే ముక్కుపిండి వసూళ్లకు మారుపేరు... రైతులు చిన్నపాటి అప్పున్నా, గడువులోపు చెల్లించకుంటే ఇంటి ముందే కూర్చుంటారనే పేరుంది. కూర్చోవడమే కాదు.. రుణగ్రస్తుడి ఇంటితలుపులు లాక్కుని తమ వాహనాల్లో వేసుకుని వెళ్లారనేది జగమెరిగిన సత్యం.. అదే అంజుమాన్ బ్యాంకు ఇప్పుడు రాజకీయ జోక్యంతో నిండా మునిగి, పీకలోతులో అవినీతితో కూరుకుని పోయింది. జిల్లాలోని 21 వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల్లో సగానికిపైగా అవినీతిలో కూరుకుని పోయి మాయమైన డబ్బును వసూలు చేయలేని పరిస్థితిలో దాపురించాయి. పాత పాలకమండలి నుంచి ప్రస్తుత పాలకమండలి వరకు కొంత మంది పుణ్యమా అని సహకార సంఘాలు దివాళా తీస్తున్నాయి.

సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన వ్యాపార కార్యక్రమాలు కొంతమంది అవినీతి పరులకు వరంగా మారాయి. 2021లో దుబ్బాక, హుస్నాబాద్, అల్లీపూర్ సహకార సంఘాల ద్వారా రైతులకు అందించిన ఎరువుల సొమ్ము భారీగా పక్కదారి పట్టింది. 2020-21లో దుబ్బాక సహకార సంఘం ద్వారా సుమారు రూ.46 లక్షలు, హుస్నాబాద్ సహకార సంఘం ద్వారా రూ.45లక్షల విలువైన ఎరువుల సొమ్ము స్వాహా అయ్యాయి. ఇక అల్లీపూర్ సహకార సంఘం రూ. 6లక్షల మేర నిధులు దుర్వినియోగమయ్యాయి ఈ అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత అధికారులు విచారణకు ఆదేశించినా, రాజకీయ ఒత్తిళ్ల వల్ల

మిగతా 8వ పేజీలో

వర్షాలతో ట్రాఫిక్ సమస్యలా

కాల్ 8712667100

● ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్



సిద్దిపేట క్రైం, ఆగస్టు 12: ఈనెల 13, 14, 15 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ సూచించారు. ఈ వర్షాల వల్ల రోడ్లు జారుడుగా మారడం, నీరు నిలిచిపోవడం వల్ల ప్రమాదాలు జరగవచ్చని కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈమేరకు ఆయన పలు సూచనలు చేశారు.

● వర్షానికి రోడ్లు జారుడుగా ఉంటాయి. వేగం తగ్గించి, ముందున్న వాహనంతో సురక్షిత దూరం పాటించండి. అనవసరమైన ఓవర్‌టేక్ చేయవద్దు.

● రోడ్డుపై చెట్లు పడిపోవడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం వంటివి జరిగితే వెంటనే ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100కు సమాచారం ఇవ్వాలి.

● రోడ్డుపై నీరు నిలిచి ఉన్న చోట మ్యాన్‌హోల్స్ లేదా గుంతలు ఉండే ప్రమాదం ఉంది. కాబట్టి ఆ ప్రాంతాల్లో ప్రయాణించకూడదు.

● అత్యవసరం అయితే తప్ప రాత్రి ప్రయాణాలు చేయవద్దు. వర్షంలో రోడ్లు స్పష్టంగా కనిపించడానికి వైపర్లు శుభ్రంగా ఉన్నాయో లేదో చూసుకోండి. టైర్లు, బ్రేకులు, హెడ్‌లైట్లు, ఫాగ్ లైట్లు సరిగ్గా పని చేస్తున్నాయో తనిఖీ చేసుకోవాలి.

● కారు నడిపే వారు తప్పనిసరిగా సీట్ బెల్టు ధరించాలి. ద్విచక్ర వాహనదారులు ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్ ధరించాలి. డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ వాడకూడదు.

చెట్లను నరికినందుకు రూ.లక్ష జరిమానా

సిద్దిపేట, ఆగస్టు 12 : సిద్దిపేటలో ఓ భవన యజమానికి చెట్లను నరికినందుకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ రూ.లక్ష జరిమానా విధించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులోని అక్షయ గ్రాండ్ లాడ్జి వద్ద దుకాణానికి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపునకు భవన యజమాని రూ.10 వేలు మున్సిపల్ కార్యాలయానికి చెల్లించాడు. సదరు అధికారులు అందుకు అనుమతినిచ్చారు. సదరు భవన యజమానికి కొమ్మలకు బదులుగా ఏపుగా పెరిగిన స్వతోడియా, మాగాణి, విగ్నోనియా ఐదు చెట్లను మొదళ్ల వరకు నరికివేశారు. డబ్బులు తీసుకునే సిబ్బంది ఈ పనిచేశారంటూ కాలనీ వాసులు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సందర్శించి, చెట్లను మొదళ్ల వరకు నరికివేయించినందుకు భవన యజమానికి రూ. లక్ష జరిమానా విధించడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

● కలెక్టర్ హైమావతి

సిద్దిపేట/సిద్దిపేట అర్బన్/నంగునూరు : ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ హైమావతి ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో జూమ్ యాప్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ తర్వాత బేస్‌మెంట్ లెవెల్‌కు రాని వారి వివరాలు తనకు అందజేయాలని సూచించారు. ఏ మండలంలోనూ ఇసుక కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో రమేష్, డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య తదితరులు పాల్గొన్నారు.



జూమ్ యాప్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

గురుకుల పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుని విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హైమావతి అన్నారు. మంగళవారం సిద్దిపేటఅర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గురుకుల పాఠశాల, హాస్టల్ ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని నాసర్‌పుర వార్డులో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ఓపీ మెడికల్ ఆఫీసర్లే రాయాలి

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను ఓపీ రిజిస్టర్‌లో డాక్టర్లు మాత్రమే రాయాలని, స్టాఫ్ నర్సు రాసి మందులు అందజేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. నంగునూరు మండలం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.



ముస్త్యాల మోడల్‌స్కూల్ ఆవరణలో నినదిస్తున్న విద్యార్థులతో జేపీసీ నాయకులు

చేర్యాల 'రెవెన్యూ' ఏర్పాటుకు విద్యార్థుల ఆందోళన

● విద్యాసంస్థల బంద్ విజయవంతం

చేర్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. జేపీసీ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. మండల కేంద్రాలతో పాటు మారుమూల గ్రామాలు, తండాల్లోనూ విద్యార్థులు జై చేర్యాల.. అంటూ నినాదాలు చేశారు. మంగళవారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని 115 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, కస్తూర్బా, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో తరగతులు నిలిచిపోయాయి. సుమారు 30 వేల మంది విద్యార్థులు ఈ బంద్‌లో పాల్గొని ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు ఈ సందర్భంగా జేపీసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ మాట్లాడుతూ, చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడం సరికాదన్నారు. డివిజన్ ఏర్పాటుతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, యువతకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేపీసీ నాయకులు అందె బీరయ్య, అందె అశోక్, బుట్టి సత్యనారాయణ, పిల్లి చంద్రం, పోలోజు వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన పారదర్శకంగా ఉండాలి

● సీపీ అనురాధ

చిన్నకోడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల విషయంలో పరిశోధన పారదర్శకంగా ఉండాలని సీపీ అనురాధ సూచించారు. చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డు, రైటర్ రూంను, సీజ్ చేసిన వాహనాలను, పరిసర ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. స్టేషన్ ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఫిర్యాదు దారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ సైఫ్‌అలీ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎస్బీ ఎస్ఐ చంద్రమోహన్ ఉన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు

● తెల్లవారుజాము నుంచే దుకాణాల ఎదుట పడిగాపులు

జిల్లాలో యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు అరకొరగా సరఫరా చేస్తుండడంతో కంటి మీద కునుకు లేకుండా దుకాణాల వద్ద క్యూ కడుతున్నారు. మంగళవారం తొగుట ఆగ్రోస్ దుకాణానికి 450 యూరియా బస్తాలు రాగా 300మందిపై చిలుకు రైతులు బారులు తీరడంతో ఒక్కో రైతుకు రెండు బస్తాలు మాత్రమే పంపిణీ చేశారు. దౌల్తాబాద్ మండలంలోని సొసైటీకి యూరియా లారీ వచ్చిందని తెలియడంతో వందలాది మంది రైతులు పరుగులు పెట్టారు. కొన్ని చోట్ల వారానికి ఒక యూరియా లారీ మాత్రమే వస్తుందని వాపోతున్నారు. నంగునూరులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగం గౌడ్ ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సిద్దిపేట అర్బన్ మండలం బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డి రైతులను అరిగోస పెడుతున్నాడని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య ముదిరాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి మండిపడ్డారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో ఫర్టిలైజర్ షాపు వద్ద రైతులు రాత్రి వరకు బారులు తీరారు. షాపులో లారీ లోడ్ మాత్రమే ఉండడం.. రైతులు మాత్రం అధిక సంఖ్యలో ఉండడంతో యజమాని కాసేపు దుకాణం మూసేశాడు.

- తొగుట/దౌల్తాబాద్/నంగునూరు/సిద్దిపేటరూరల్/నారాయణరావుపేట/సిద్దిపేటఅర్బన్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి)



దౌల్తాబాద్ మండల కేంద్రంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఆర్టీసీకి 'పండుగ'

● ఒక్కరోజే రూ.2.73 కోట్ల ఆదాయం

● మెదక్ రీజియన్ రికార్డు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి రాఖీ పౌర్ణమి కలిసొచ్చింది. వరుస సెలవులతో పాటు రాఖీ పండుగ రావడంతో మెదక్ రీజియన్‌కు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. వరలక్ష్మీవ్రతం, రాఖీ పౌర్ణమి, ఆదివారం వరుసగా రావడంతో ఈ నెల 8, 9, 10 తేదీల్లో ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ రీజియన్ వ్యాప్తంగా సుమారు 200 పైగా ప్రత్యేక బస్సులు నడిపింది. ప్రయాణికులు కూడా పెద్ద సంఖ్యలో ఈ సారి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. సురక్షిత బస్సు ప్రయాణం కావడంతో ప్రయాణికులు ఇటు వైపే మొగ్గుచూపారు. దీంతో మెదక్ రీజియన్ పరిధిలోని ఎనిమిది డిపోల ద్వారా ఈ నెల 9న ఒక్క రోజే సుమారు రూ.2.73 కోట్ల ఆదాయం సమకూరిందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాస్కర్ తెలిపారు. అంతేకాకుండా 3.87 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషి వల్లే ఆర్టీసీ ఈమేరకు ఆదాయం అర్జించిందని ఆయన అభినందించారు.

డిపోల వారీగా ఆదాయం

డిపో	ఆదాయం (లక్షల్లో)
మెదక్	41.85
నారాయణఖేడ్	25.06
నర్సాపూర్	11.85
సంగారెడ్డి	41.79
జహీరాబాద్	35.73
సిద్దిపేట	48.12
గజ్వేల్ ప్రజ్ఞాపూర్	42.75
దుబ్బాక	26.74
మొత్తం	2.73 కోట్లు

108 అంబులెన్స్ రాకపోవడంపై వైద్యాధికారుల విచారణ



సంగారెడ్డి జీజీహెచ్‌లో విచారణ చేస్తున్న అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్, డీఎంహెచ్‌వో, అధికారులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన వెంకటేశం(32) ఈ నెల 10వ తేదీన పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. ఆస్పత్రికి తరలించేందుకు కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసినా వాహనం రాలేదు. దీంతో తోటి స్నేహితులే అతడిని సుమారు 40 కిలోమీటర్ల దూరం బైక్‌పైనే సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి క్యాజువాలిటీ తీసుకొచ్చారు. ఆస్పత్రికి వచ్చేలోపే వెంకటేశం మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమయానికి అంబులెన్స్ వస్తే వెంకటేశం బతికేవాడని స్నేహితులు, కుటుంబసభ్యులు ఆరోపించారు. అయితే ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని విచారణకు ఆదేశించింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డా.అమర్‌సింగ్, స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, స్టేట్ 108 ప్రోగ్రాం ఆఫీసర్‌తో పాటు సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల మంగళవారం జీజీహెచ్‌కు చేరుకొని విచారణ చేశారు. జీజీహెచ్ క్యాజువాలిటీ రికార్డులు పరిశీలించారు. ఫోన్ చేసినా 108 అంబులెన్స్ రాకపోవడానికి గల కారణాలను ఆరా తీశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. వారి వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.మురళీకృష్ణ, ఆర్ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.రవికుమార్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి సేవా పురస్కారానికి ఎంపికైన శేరి

చేర్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణానికి చెందిన శేరి బాలనారాయణ జాతీయస్థాయి సేవాపురస్కారానికి ఎంపికయ్యారు. కిరాణవర్తక సంఘం అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న ఆయన సామాజిక సేవలో రాణిస్తుండటాన్ని హైదరాబాద్ మనం ఫౌండేషన్ సంస్థ గుర్తించి బెస్ట్ సేవా గోల్డెన్ నంది నేషనల్ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేసింది.





రేజింతల్ సిద్ధివినాయక స్వామి ఆలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు, ఆలయంలో స్వామివారు

సంకష్ట చతుర్థి పూజలు

న్యాల్‌కల్/పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : అంగారక సంకష్టహర చతుర్థి సందర్భంగా మంగళవారం సిద్ధి వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ సిద్ధివినాయక, పటాన్‌చెరురూరల్ పరిధిలోని రుద్రారం గణేష్‌గడ్డ సిద్ధి గణపతి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ ఆలయాల్లో పురోహితులు తెల్లవారుజామునే విశేష అభిషేక కార్యక్రమాలను నిర్వహించి, ప్రత్యేక పూజలను చేశారు. విశేష అలంకరణలో స్వామివారు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్లు వేచిఉండి దర్శనం చేసుకుని మొక్కులను చెల్లించుకున్నారు. రేజింతల్ ఆలయాన్ని ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా న్యాయాధికారి భవానీచంద్ర, జహీరాబాద్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కవితాదేవి సందర్శించి ప్రత్యేక పూజలను చేశారు. ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



రుద్రారం గణేష్‌గడ్డ ఆలయంలో భక్తుల రద్దీ

క్రైం కార్నర్

రాఖీ పండుగకని అమ్మగారి ఊరెళ్లగా.. ఇంట్లో చోరీ

● రూ.5 లక్షల నగదు, బంగారు ఆభరణాలు అపహరణ



డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

జగదేవ్‌పూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగకు ఊరికి వెళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని దుండగులు ఇళ్లను గుల్ల చేశారు. భారీ నగదుతో పాటు, వెండి, బంగారు ఆభరణాలు అపహరించారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ మండలం నిర్మల్‌నగర్ గ్రామానికి చెందిన కర్రె మాధవి భర్త ఏడాది క్రితం మృతిచెందాడు. ఇద్దరు పిల్లలను చదివిస్తూ గ్రామంలోనే ఉంటుంది. రైతు బీమా డబ్బు రూ.ఐదు లక్షలు రావడంతో బంధువులకు ఇచ్చింది. వారు ఈ నెల ఒకటిన తిరిగి ఐదు లక్షలు ఇచ్చేశారు. నగదును, 12 తులాల వెండి గొలుసు, అర తులం బంగారు రింగు ఇంట్లో బీరువాలో భద్రపరిచింది. రాఖీ పండుగ సందర్భంగా శనివారం ఇంటికి తాళం వేసి అమ్మగారి ఊరైన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, మూడు చింతలపల్లి మండలం యాదారాసిపల్లి గ్రామానికి వెళ్లింది. సోమవారం ఉదయం మాధవి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో స్థానికులు చూసి ఆమెకు సమాచారమిచ్చారు. వెంటనే గ్రామానికి చేరుకొని ఇంటిలో చూడగా నగదు, వెండి, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితురాలు మాధవి లబోదిబోమంటూ రోదించింది. జగదేవ్‌పూర్ ఎస్‌ఐ కృష్ణారెడ్డికి సమాచారమివ్వగా, సీఐ మహేందర్‌రెడ్డి పోలీసులతో పాటు, క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో గ్రామానికి చేరుకుని మాధవి ఇళ్లంతా తిరిగి వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్, కరీంనగర్ వరంగల్ జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరంలో దొంగతనాలు చేసి పలుమార్లు జైలుకు వెళ్లిన అంతర్ జిల్లా దొంగను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్లు సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం రాయవరం గ్రామానికి చెందిన డపేట బాల్‌లింగం అలియాస్ లింగం అలియాస్ బాబు అలియాస్ ప్రవీణ్(30)పై జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో 80కిపైగా దొంగతనం కేసులు నమోదయ్యాయని తెలిపారు. సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి విఘ్నేశ్వరనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఐదు తులాల బంగారం, మరో ఐదు తులాల నగలు దొంగలించారనే ఫిర్యాదుతో త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ కేసు దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా మంగళవారం బీజేఆర్ చౌరస్తా వద్ద బంగారం అమ్మడానికి వచ్చి బ్యాగ్ వేసుకొని నిలబడి ఉండగా సిబ్బంది సహకారంతో చాకచక్యంగా పట్టుకున్నారని పేర్కొన్నారు. నిందితుడు వద్ద నుంచి పది తులాల బంగారం సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

అదృశ్యమైన యువతి చెరువులో శవమై..



శ్రావణి (ఫైల్)

తూప్రాన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): షాపునకు వెళ్లస్తానని ఇంట్లోంచి వెళ్లిన యువతి అదృశ్యం కాగా, మంగళవారం చెరువులో శవమై లభ్యమైన సంఘటన తూప్రాన్ పట్టణంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. మాసాయిపేటకు చెందిన గుడ్డి లక్ష్మి తన ఇద్దరు కూతుర్లతో తూప్రాన్‌లో నివాసముంటుంది. చిన్నకూతురు శ్రావణి(18) గతేడాది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరి అనారోగ్యంతో చదువును మధ్యలోనే ఆపేసింది. సోమవారం తల్లి లక్ష్మి ఇళ్లల్లో పనులు చేసేందుకు వెళ్లగా, కూతురు శ్రావణి ఇంటి వద్దనే ఉంది. తల్లి ఇంటికి వచ్చే సమయంలో బయటకు వెళ్తుండగా, ఎక్కడికని లక్ష్మి అడగగా షాపునకు అని చెప్పి వెళ్లిపోయింది. సాయంత్రం వరకు రాకపోవడంతో సోమవారం తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసును నమోదు చేసుకున్నారు. కాగా, మంగళవారం తూప్రాన్ పెద్దచెరువులో శ్రావణి మృతదేహం తేలింది. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

శివ్వంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : తమ భూమిలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకుంటుండగా అడ్డుకుని, కులం పేరుతో దూషించారని ఆరోపిస్తూ బాధితులు పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసిన ఘటన మంగళవారం పాంబండలో చోటు చేసుకున్నది. బాధితుల వివరాలు మేరకు.. మండల పరిధిలోని పాంబండ గ్రామంలో సర్వే నంబర్ 128లో ఇదే గ్రామానికి చెందిన పదిమంది దళిత కుటుంబాలు 30 సంవత్సరాల క్రితం బండమీదపల్లి బత్తుల వీరయ్య, పాంబండ గ్రామానికి చెందిన దొడ్ల యశ్వంత్ దగ్గర 29 గుంటలను కొనుగోలు చేసి, గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. అయితే దళిత కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, వారు నిర్మాణం చేపట్టారు. గ్రామానికి చెందిన ఆంజనేయులు, మల్లేష్, దశరథ్ చిన్న మల్లేష్, పోచయ్య అక్కడికి వచ్చి ఈ భూమి తమది అని బూతులు తిడుతూ, కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడ్డారని బాధిత మహిళలు ఆరోపించారు. కులం పేరుతో దూషించిన వ్యక్తులపై తక్షణమే కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని బాధిత మహిళలు డిమాండ్ చేశారు. వారి వెంట సీఐటీయూ జిల్లా కార్యవర్గసభ్యుడు మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇంటి పేరుతో రాత్రివేళ ఇసుక తరలింపు

● పట్టుకున్న పోలీసులు... తహసీల్దార్‌కు ఫిర్యాదు
● జరిమానాపై బాధితుల వాగ్వాదం

వెల్దుర్తి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇంటి పేరుతో రాత్రివేళ ఇసుక తరలిస్తుండడంతో జరిమానా విధించగా తహసీల్దార్‌తో వాగ్వాదం నెలకొన్న సంఘటన వెల్దుర్తిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. ఈనెల 7న తెల్లవారుజామున వెల్దుర్తి మండలంలోని మేల్లూరు గ్రామ శివారు హల్దీవాగు నుంచి చిన్నశంకరంపేట మండలంలోని భాగిర్తీపల్లికి చెందిన సిద్ధిరాములు ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నాడు. వెల్దుర్తి పోలీసులు పట్టుకుని ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి తహసీల్దార్ బాలలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె ట్రాక్టర్‌కు రూ.20 వేల జరిమానా విధించారు. దీంతో ట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ఇందిరమ్మ ఇంటికి ఇసుకను తెసుకెళ్తున్నామని, రూ.20 వేల జరిమానా చెల్లించమంటే ఎలా చెల్లిస్తామని తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. పోలీస్, రెవెన్యూ శాఖ అనుమతులతో పగటి వేళల్లో ఇసుకను తీసుకెళ్లాలని తహసీల్దార్ బదులిచ్చారు.



ముత్యంరాయుడి కోట ఆరు బురుజుల్లో మిగిలిన మైసమ్మ బురుజు ఇదే..

చెదిరిన చరిత్ర

ముత్యంరాయుడి ఆనవాళ్లు నేలమట్టం

ఐదు వందల ఏళ్ల నాటి కోట శిథిలం
గుప్త నిధుల కోసం తవ్వకాలతో ధ్వంసం
ఆరు బురుజుల్లో మిగిలింది ఒక్కటే

సిద్దిపేట రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణరావుపేట గ్రామానికి సమీపంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ముత్యంరాయుడు తన కోటను నిర్మించుకున్నాడు. కోట చుట్టూ ఆరు బురుజులు ఉండేవని, వాటిని బంగ్లా బురుజు, మూల బురుజు, బావి బురుజు, బోగందాని బురుజు, మైసమ్మ బురుజు, చీకటి బురుజుగా పిలిచేవారని గ్రామస్థులు చెబుతారు. కోట పక్కనే ప్రజల తాగునీటి, సాగునీటి అవసరాల కోసం ఒక చెరువు తవ్వించాడని, దాన్ని ఇప్పటికీ ముత్యంపేట చెరువుగా పిలుస్తున్నారని పేర్కొన్నారు. శత్రువులు రాకుండా ఈ చెరువులో మొసళ్లను పెంచేవారని ప్రచారంలో ఉంది. కాలక్రమంలో కోట, బురుజులు ఒక్కొక్కటిగా కూలిపోయాయి. ప్రస్తుతం కేవలం మైసమ్మ బురుజు మాత్రమే మిగిలింది. ముత్యంరాయుడు మైసమ్మ దేవతను పూజించేవాడని, కోట లోపల ఆ ఆలయం ఉంది. ప్రస్తుతం దుర్గమ్మ పూజారులు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కాకతీయుల కాలం నాటి వాస్తుశిల్పాలతో ఈ కోట నిర్మించబడిందని చరిత్రకారుల ద్వారా తెలుస్తోంది.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

కోట, బురుజులు శిథిలావస్థకు చేరుకోవడంతో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయి. కొందరికి నిధులు దొరికాయని, వారి ఎదుగుదలకు కారణం అవేనని ఇప్పటికీ గ్రామంలో ప్రచారంలో ఉన్నది. గతంలో ప్రభుత్వ కాంట్రాక్టర్లు భవనాలు, డ్రైనేజీల నిర్మాణం కోసం కోట రాళ్లను కొల్లగొట్టారని, అప్పట్లో ప్రశ్నించేవారు లేకపోవడంతో చారిత్రక ఆనవాళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని గ్రామస్థులు తెలిపారు. చరిత్రకు ఆధారంగా మిగిలింది ముత్యంపేట చెరువు, మైసమ్మ బురుజు మాత్రమే. ముత్యంరాయుడి చరిత్రపై పూర్తిస్థాయిలో పరిశోధన చేసి, పాఠ్యాంశంగా మార్చాలని అప్పట్లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొండి మల్లారెడ్డి ప్రయత్నం చేశారు. ఆయన కృషితోనే ఈ ప్రాంత ప్రాముఖ్యత బయటపడింది.

నేటి తరాలకు తెలిసేలా చేయాలి



ముత్యంపేట బురుజులు, కోట బంగ్లా ఆనవాళ్లు మా చిన్నతనంలో చూసినం. ఆ శిథిలమైన ప్రాంతానికి ఇంత చరిత్ర ఉందని చాలా మందికి తెలియదు. ముత్యంరాయుడి ఆదర్శ పోరాటాలు, ప్రజలకు అందించిన సేవలపై నేటి తరాలకు తెలియజేయాలి. ప్రభుత్వం చొరవ తీసుకుని పురావస్తుశాఖ ద్వారా అధ్యయనం చేయించాలి. ఇప్పటికే కోట, బురుజులు పూర్తిస్థాయిలో నెలమట్టం అయ్యాయి. చరిత్రకు ఆధారంగా మిగిలిన మైసమ్మ బురుజును కాపాడాలి.

- కొంగరి కనకయ్య, నారాయణరావు పేట

రాష్ట్రానికి ఎరువులు సరఫరా చేయాలి

● కేంద్ర మంత్రిని కోరిన మంత్రి, ఎంపీ

నారాయణఖేడ్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి అవసరమైన మేరకు ఎరువులు సరఫరా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ కోరారు. వారు మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి అనుప్రియ పటేల్‌ను కలిశారు. రాష్ట్రంలో పండిస్తున్న పంటలు, ఎరువుల ఆవశ్యకతను ఆమెకు వివరించి ఎరువుల కొరత లేకుండా అవసరాలకు తగిన మేరకు సరఫరా చేయాలని కోరారు.



కేంద్ర మంత్రి అనుప్రియపటేల్‌తో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ సురేష్ షెట్కార్

ఉత్తమ నార్కొటిక్ ట్రైనర్‌గా రాజేశ్వర్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉత్తమ నార్కొటిక్ ట్రైనర్‌గా కొంక రాజేశ్వర్ ఎంపికయ్యారు. మాదక ద్రవ్యాలపై అవగాహన శిక్షణ కార్యక్రమాలను జిల్లాలో ఇటీవల నిర్వహించారు. ఇందుకుగానూ హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం యాంటీ నార్కొటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్యా చేతుల అవార్డుతో పాటు రూ.10వేల నగదు అందజేశారు.



అవార్డు అందుకుంటున్న రాజేశ్వర్

ఆర్థిక అక్షరాస్యతే ఆర్‌బీఐ లక్ష్యం: జీఎం

గుమ్మడిదల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక ప్రతిష్ఠను, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) కృషి చేస్తోందని ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ సుప్రభాత్ తెలిపారు. వంద శాతం ఆర్థిక అక్షరాస్యతతోనే ఈ లక్ష్యం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. గుమ్మడిదలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత సాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీఒక్కరు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కలిగి ఉండాలని, డిజిటల్ చెల్లింపులు అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి ప్రభుత్వ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆర్‌బీఐ సూచనల మేరకు ప్రతి మారుమూల గ్రామంలో ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేపై దాడికి యత్నం

● కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చిచ్చురేపిన వాట్సాప్ పోస్టులు

పెద్దశంకరంపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిపై కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి యత్నించారు. మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేటలోని ఓ వాట్సాప్ గ్రూప్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఒకరిపై మరొకరు వ్యక్తిగత దూషణలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పెద్దశంకరంపేటలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ ఇంటి ఎదుట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. అదే సమయంలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్‌తో కలిసి అక్కడికి రావడంతో ఒక్కసారిగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకుని దాడికి యత్నించారు. అక్కడే ఉన్న ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తన సిబ్బందితో వారిని చెదరగొట్టారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి వచ్చి ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాట్సాప్ గ్రూపుల్లో ఎవరైనా వ్యక్తిగత దూషణలకు పాల్పడితే, గ్రూప్ అడ్మినిలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రూపుల్లో వ్యక్తిగత దూషణలు, ఇతర పోస్టులు వస్తే అడ్మిని వాటిని వెంటనే తొలగించాలని సూచించారు.



పెద్దశంకరంపేటలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కారును చుట్టుముట్టిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

● ఇరుకు గదుల్లో కొనసాగుతున్న వైనం
● అరకొర వసతులతో గర్భిణులు, చిన్నారులకు ఇబ్బందులు





చిన్నకోడూరులో అద్దెభవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం-1, స్లాబ్‌కే పరిమితమైన అంగన్‌వాడీ కేంద్రం భవనం

చిన్నకోడూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నాయి. ముఖ్యంగా సొంత భవనాలు లేని కేంద్రాలను ఇరుకు గదుల్లో, అరకొర వసతులతో నడుపుతుండడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన వసతులు లేకపోవడం వల్ల పిల్లలను అంగన్‌వాడీలకు పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు.

ఏడు అద్దె భవనాల్లో..

చిన్నకోడూరు మండలంలో మొత్తం 54 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 28 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, 19 కేంద్రాలు రెంట్ ఫ్రీ భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన ఏడు కేంద్రాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. చిన్నకోడూరులో ఉన్న ఐదు కేంద్రాలకు గాను నాలుగు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. రంగాయిపల్లి, ఇబ్రహీంనగర్, శంకరాయకుంటలలో కూడా అద్దె భవనాల్లోనే కేంద్రాలు నడుస్తున్నాయి. ప్రభుత్వం నెలకు రూ.వెయ్యి అద్దె చెల్లిస్తోంది. అద్దె ఆ మొత్తం కంటే ఎక్కువగా ఉంటే అంగన్‌వాడీ టీచర్లే మిగిలిన డబ్బు భరించాల్సి వస్తోంది.

నిలిచిపోయిన భవన నిర్మాణాలు

అద్దె భవనాల్లో ఉన్న కొన్ని కేంద్రాలకు గతంలో భవనాలు మంజూరైనా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మరికొన్నింటికి పనులు అసలు ప్రారంభం కాలేదు. చిన్నకోడూరులోని రెండు కేంద్రాల భవన నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. అద్దె భవనాల్లో కనీస మౌలిక సదుపాయాలు, ఆట స్థలం, ఇతర పరికరాలు లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయాలని, భవనాలు లేని కేంద్రాలకు కొత్తవి మంజూరు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోహీర్ భీమ్‌నగర్‌లో శిథిల భవనంలో అంగన్‌వాడీ



కోహీర్ ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మున్సిపల్ పట్టణంలోని భీమ్‌నగర్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో భవనం ఎప్పుడు కూలిపోతుందోనని చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ శిథిల భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించాలని స్థానికులు గతంలో ప్రభుత్వాన్ని కోరారు. దీంతో మూడేళ్ల క్రితమే ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. పాత భవనం పక్కనే కొత్త భవన నిర్మాణం పూర్తయినా, అందులోకి అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చడం లేదు. ఈ భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు ఇంకా బిల్లులు చెల్లించాల్సి ఉందని, అందుకే భవనాన్ని అప్పగించడం లేదని తెలిసింది. శిథిలావస్థకు చేరుకున్న భవనంలోనే పిల్లలకు బోధన కొనసాగిస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు భారీ వర్షాలు కురుస్తున్న వేళ, భవనం కూలిపోతే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

చేయి చేయి కలిపి.. చెరువును బాగుచేసుకుని..

● దుబ్బ చెరువుకు పూర్వ వైభవం తెచ్చేందుకు రాంపూర్ రైతుల ముందడుగు
● విరాళాలు వేసుకుని కట్టుకాల్వకు మరమ్మతులు

అల్లాదుర్గం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో చెరువు నిర్వీర్యంగా మారడంతో రైతులు చేయిచేయి కలిపి బాగు చేసుకునేందుకు ముందుకువచ్చారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం రాంపూర్‌లోని దుబ్బ చెరువులోకి ఎగువన ఉన్న కాయిదంపల్లిలోని ఊరచెరువు నుంచి గొలుసుకట్టు కాల్వల ద్వారా నీరు చేరుతుంది. ఊరచెరువు నుంచి తొలుత ఎర్రకుంటకు నీరు చేరుకుని అక్కడి నుంచి కట్టుకాల్వ ద్వారా దుబ్బ చెరువులోకి చేరుతుంది. అయితే, అధికారుల అలసత్వం వల్ల కట్టుకాలవ పూడికతో, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో నీరు చెరువులోకి రాకుండా పక్కనే ఉన్న పొలాల్లోకి ప్రవహించి పంటలను ముంచేస్తున్నది. గతంలో కూడా రైతులు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు లేకపోవడంతో చెరువు నిండలేదు. ఈసారి కూడా అధికారులు స్పందించకపోవడంతో రైతులే స్వయంగా మరమ్మతు పనులు చేపట్టారు. ఆయకట్టు రైతులు విరాళాలు సేకరించుకొని, రెండు ఎక్స్‌కవేటర్‌లతో కట్టుకాల్వలో పేరుకుపోయిన మట్టిని, పిచ్చి మొక్కలను తొలగించే పనికి మంగళవారం శ్రీకారం చుట్టారు. అధికారులు స్పందించి వేసవిలో మరమ్మతులు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాయిదంపల్లి ఊరచెరువు నిండి అలుగు పారుతున్నప్పటికీ కట్టుకాల్వలో పూడిక కారణంగా దుబ్బ చెరువులోకి నీరు చేరక బోసిపోయిందని రైతులు తెలిపారు. అందుకే విరాళాలు వేసుకుని మరమ్మతులు చేసుకుంటున్నామని, ఇకపై దుబ్బ చెరువులోకి నీరు చేరి, తమ పంటలు సస్యశ్యామలం అవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





ఎర్రకుంట కట్టుకాల్వకు గండి పడి వృథాగా పోతున్న నీరు,పిచ్చిమొక్కలు, మట్టిని తీస్తున్న ఎక్స్‌కవేటర్

పంచాయతీ సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలస్వామి

సిద్దిపేట రూరల్/ అర్బన్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి అన్నారు. మంగళవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రూరల్ మండల మహాసభను సిద్దిపేటలోని కార్మిక కర్షక భవన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతినిత్యం గ్రామాలలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, విద్యుత్ నిర్వహణ, ట్రాక్టర్ నిర్వహణ, డంపింగ్ యార్డ్ నిర్వహణ ప్రభుత్వ పథకాలలో సహకారం వంటి అనేక కార్యక్రమాలలో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందికి ప్రమోషన్ కల్పించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవకాశం కల్పించాలని సిబ్బందికి పంచాయతీ ద్వారానే డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పించాలని ప్రమాదంలో మరణించిన కార్మికులకు 30 వేల రూపాయలకు ఎక్స్‌గ్రేషియా పెంచాలని అనంతరం 12 మందితో కూడిన మండల కమిటీని ఎన్నుకున్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

జగదేవ్‌పూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తిగుల్ ఎస్సీ హాస్టల్ వార్డెన్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో ఏవో అబ్దుల్ రహమాన్‌కు యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గుడికందుల రవి మాట్లాడుతూ .. 45 రోజుల క్రితం జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ ఎస్సీ హాస్టల్‌ను తమ సంఘం ఆధ్వర్యంలో సందర్శించినట్లు చెప్పారు. హాస్టల్‌లో వార్డెన్ సమయపాలన, మెనూ, పరిశుభ్రత పాటించకపోవడం, శౌచాలయాలను శుభ్రం చేయకపోవడం, విద్యార్థులకు వచ్చిన కాస్మోటిక్ చార్జీలను ఇవ్వకపోవడం, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు, విద్యార్థులు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. విద్యార్థుల సమస్యలను జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిని కవితకు వినతిపత్రం అందజేసినా ఇప్పటివరకు హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోలేదన్నారు. హాస్టల్ వార్డెన్, డీఎస్సీ, డీవో కవితపై విచారణ చేపట్టి ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెన్షన్‌దారుల మహా గర్జన

● సదస్సుకు మంద కృష్ణ మాదిగ రాక

హుస్నాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులతో పాటు ఆసరా పెన్షన్లు పెంచాలని బుధవారం హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించే పెన్షన్‌దారుల మహా గర్జన సదస్సును విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ మాదిగ కోరారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సదస్సుకు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు ఇచ్చిన పెన్షన్ల పెంపు హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలి

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కావాలని అసెంబ్లీలో తీర్మానం చేయించిన సీఎం రేవంత్‌రెడ్డికి ముదిరాజ్ మహాసభ పక్షాన ధన్యావాదాలు తెలియజేస్తున్నామని అలాగే ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని సీఎంకు విజ్ఞప్తి చేస్తున్నట్లు ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు పెండ్యాల అయిలయ్య, నియోజక వర్గం అధ్యక్షుడు చొప్పరి శ్రీనివాస్, హుస్నాబాద్ మండల మహాసభ అధ్యక్షులు పొన్నబోయిన శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ముదిరాజ్ మహాసభ ప్రతినిధుల సమావేశంలో పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు.అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చుతామని హామీ ఇచ్చారని ఇచ్చిన హామీని నెరవేర్చి ముదిరాజ్‌ల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎంతో మాట్లాడి ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కొమ్ము యాదగిరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



ములుగులో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

ములుగు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుడు కొమ్ము యాదగిరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన ములుగులోని యాదగిరి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పంచాయతీ కార్మికులతో కలిసి గ్రామపంచాయతీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. యాదగిరి విద్యుత్ స్తంభంపై నుంచి పడి చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఈ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని అన్నారు. అంతేకాకుండా మృతుడి కుటుంబానికి 25 లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన యాదగిరికి ఇల్లు కూడా లేదని భార్య అనురాధకు ఉద్యోగం కల్పించడమే కాకుండా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంపై జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య ఎంపీడీవోకి తెలపడంతో మృతుడి కుటుంబం కోసం జిల్లా అధికారి డీసీవో దృష్టికి తీసుకుపోయి న్యాయం జరిగే విధంగా తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవం

కోహెడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కోహెడలో ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాన్ని వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను మండల సీపీఐ కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్ ఆవిష్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ గత 90 సంవత్సరాలు నుంచి విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని కొనియాడారు. దేశంలో మొట్టమొదటి స్థాపించబడిన విద్యార్థి సంఘం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు బోనగిరి శంకర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చిట్యాల శేఖర్, కందుకూరి అంతయ్య, మహేష్, రాజశేఖర్, మనోజ్, అఖిల్, అజయ్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అండగా... కాంగ్రెస్ ప్రభుత్వం

జగదేవ్‌పూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సీఎం సహాయనిధి వరం అని తిగుల్ గ్రామ మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 13 మందికి మంజూరైన 6,80,000 రూపాయల చెక్కులు లబ్దిదారులకు భానుప్రకాష్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

మాజీ సైనికులు, రైతులకు సన్మానం

బెజ్జంకి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకుని బీజేపీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మంగళవారం బెజ్జంకిలో బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టారు. సందర్భంగా మాజీ సైనికులు, రైతులను బీజేపీ నాయకులు సన్మానించారు. అనంతరం గాంధీ, అంబేద్కర్ విగ్రహాలను నీటితో శుద్ధి చేసి పూలమాల వేశారు.

ఆకతాయిల ఆగడాలు

● మహిళా జూనియర్ కళాశాలలో వికృత చేష్టలు
● సీసీ కెమెరాలు, మెయిన్ గేట్ ధ్వంసం
● శానిటరీ ప్యాడ్ మిషన్ ధ్వంసం
● బాత్‌రూమ్‌ల్లో రహస్య కెమెరాల అనుమానంతో భయం

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పోకిరీల చేష్టలకు అడ్డూఅదుపులేకుండా పోతుంది. ఇదే ప్రాంగణంలో బాలికల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. కళాశాల సమయం అయిపోయిన తర్వాత, సెలవు రోజుల్లో అసాంఘిక కార్యకలపాలకు క్యాంపస్‌ను అడ్డాగా మారుస్తున్నారు. ప్రాథమిక పాఠశాల వెనకాల నుంచి కళాశాల ఆవరణలోకి ప్రవేశించి వికృత చేష్టలకు పాల్పడతున్నారు. దీంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు.



ఏసీపీ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చిన ఏబీవీపీ నాయకులు

పోలీసులకు ఫిర్యాదు చేసినా..

కళాశాలలో విద్యార్థినుల కోసం శానిటరీ ప్యాడ్స్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. రూ.5 కాయిన్ అందులో వేస్తే ప్యాడ్స్ వస్తాయి. కొద్దిరోజుల క్రితం కళాశాలలో చొరబడిన ఆకతాయిలు ఈ మెషీన్‌ను పగులగొట్టారు.

అయితే అందులో వేసే చిల్లర కోసం ఈ పని చేశారా లేక బాత్‌రూమ్‌ల్లో రహస్యంగా కెమెరాలు ఏర్పాటు చేశారా అన్న అనుమానంతో విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేసినా ఇప్పటివరకు కేసులో పురోగతి లేదు.

అంతకుముందు కళాశాలలోని సీసీ కెమెరాలను, మెయిన్ గేట్‌ను ధ్వంసం చేశారని అధ్యాపకులు తెలిపారు. అధ్యాపకులు కలిసి ఈ గేట్‌ను రిపేర్ చేయించారు. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయని తక్షణమే భద్రతా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రక్షణ కల్పించాలి : ఏబీవీపీ

దొంగతనంగా జూనియర్ కళాశాల లోపలికి వికృత చేష్టలకు పాల్పడుతున్న వారిని కనిపెట్టి చర్యలు తీసుకోవాలని, విద్యార్థినులకు రక్షణ కల్పించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో సిద్ధిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ పోకిరీల చర్యలతో విద్యార్థినులు అభద్రత భావానికి గురవుతున్నారని ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్య ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



కళాశాలలోని ధ్వంసమైన శానిటరి మిషన్, కళాశాల ఈ వెనుక భాగం నుంచి లోపలికి వచ్చే అవకాశం ఉన్న ప్రాంతం

కళాశాల పరిసరాలను మంచికి ఉపయోగించుకోండి

కళాశాల ఆవరణను, పరిసరాలను మంచి కోసం వినియోగించుకోవాలి. అంతేకానీ, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, వికృత చేష్టలకు పాల్పడడం వల్ల చాలా ఇబ్బందిగా ఉంది. రాత్రి సమయంలో కళాశాలకు మేం పహారా ఉండలేం కదా. పోలీసులు చొరవ తీసుకుని ఈ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నాం. మహిళ కళాశాల ఆవరణలోకి ఆకతాయిలు రాకుండా భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

- హిమబిందు, ప్రిన్సిపాల్, మహిళా జూనియర్ కళాశాల

తాళం పగలగొట్టి చోరీకి యత్నం

సిద్దిపేట క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మెడికల్ షాప్ షెటర్ తాళం పగలగొట్టి గుర్తు తెలియని దుండగుడు చోరీకి యత్నించిన ఘటన జిల్లా కేంద్రం సిద్దిపేట పట్టణంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన రామచంద్రం అనే వ్యక్తి సిద్దిపేట పట్టణం హైదరాబాద్ రోడ్డులో బీజేఆర్ చౌరస్తాలో వైష్ణవి మెడికల్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి రామచంద్రం మెడికల్ షాప్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగుడు షెటర్ తాళం పగలగొట్టి లోపలికి వెళ్లి దొంగతనానికి యత్నించాడు. క్యాష్ కౌంటర్‌లో ఎలాంటి నగదు లేకపోవడంతో దుండగుడు అక్కడినుంచి జారుకున్నాడు. ఇదంతా షాప్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. షాప్ యజమాని రామచంద్రం మంగళవారం ఉదయం వచ్చి చూసే సరికి షాప్ తాళం పగలగొట్టి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. క్లూస్ టీం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వేలి ముద్రలు సేకరించి, దర్యాప్తు చేపట్టారు.

దూరవిద్యను సద్వినియోగం చేసుకోండి



దూరవిద్య కోర్సు వివరాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధ్యాపకులు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఉస్మానియా యూనివర్శిటీ పరిధిలోని ప్రొఫెసర్ జి.రామ్ రెడ్డి దూరవిద్య డిగ్రీ, పీజీ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, పీజీఆర్ఆర్‌సీడీఈ సిద్దిపేట అధ్యయన కేంద్రం సమన్వయ కర్త శ్రీనివాస్ సూచించారు. దూరవిద్య కోర్సులకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. గతంలో చదువుకోవడానికి అవకాశం లేనటువంటి మధ్యలో చదువు మానేసినటువంటి విద్యార్థులకు దూరవిద్య సువర్ణ అవకాశమన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. భారతదేశంలో ఎక్కడ నుండి అయినా విదేశీ విద్యార్థులు ఆయన అందరికీ కోర్సులో అడ్మిషన్ పొందడానికి అవకాశం ఉందని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9440884089 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి అయోధ్య రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

గజ్వేల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలని, వాటిని సద్వినియోగంతో విజ్ఞానాభివృద్ధి సాధ్యమని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు అన్నారు. భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగా దేశంలోని గ్రంథాలయాలు ఆధునికతను సంతరించుకున్నాయని తెలిపారు. ఆయనవెంట గ్రంథాలయాధికారి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు భవాణీ, మహేందర్, విజయభాస్కర్‌రెడ్డి, అలివేలు, శివశంకర్, మమత, పద్మ, చాంద్, సాయి, రమేశ్, తిరుపతి, నగేశ్, జబ్బార్, స్వామి తదితరులున్నారు.

స్టాక్ వివరాలను నమోదు చేయాలి

కొమురవెల్లి,(ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి మంగళవారం తనిఖీ చేసి ఎరువుల క్రయవిక్రయాల రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఫర్టిలైజర్ దుకాణాల యజమానులకు పలు సూచనలు చేశారు. యూరియా కొరత సృష్టించవదని నిబంధనల ప్రకారమే రైతులకు యూరియా విక్రయించాలన్నారు. ఎరువుల స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడూ రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. అనంతరం కొమురవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతుభీమా ధరఖాస్తుల ప్రకియను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి వెంకట్రావమ్మ,ఏఈవోలు,తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి అస్తిత్వ కెరటం అనిశెట్టి రజిత

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో గుండెపోటుతో చనిపోయిన ప్రముఖ రచయిత్రి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజితకు మంగళవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుశాఖ అధ్యక్షుడు మట్టా సంపత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. అనిశెట్టి రజిత తెలంగాణ సాహిత్య ఉద్యమరంగ స్త్రీశక్తికి ప్రతినిధిగా చెప్పుకోదగిన అస్తిత్వకెరటం అని అన్నారు. తన మరణం తీరనిలోటని అన్నారు. పాఠశాల విద్యార్థి స్థాయిలో మొదలయిన అస్తిత్వ ఉద్యమస్పృహను ఉద్యోగ విరమణ తర్వాత కూడా అంతే స్ఫూర్తిదాయకంగా అంకితభావంతో ప్రచారం చేయటంలో అలుపెరుగని నిస్వార్థతతో పనిచేశారని గుర్తు చేశారు.

విష సంస్కృతి జోలికి వెళ్లొద్దు

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు బాగా చదువకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విష సంస్కృతి జోలికి వెళ్లవద్దని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, మహిళా పోలీస్ పోలీస్ స్టేషన్ సీఐ దుర్గా అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలో గల సురభి మెడికల్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని, ర్యాగింగ్ చేయడం, అసాంఘిక చర్యకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు అన్నారు.

వరద నీటిలో సంత



నిలిచిన నీటిమధ్యలో తోపుడుబండ్లు పెట్టుకున్న చిరువ్యాపారులు

చేర్యాల, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి స్థానిక అంగడిబజారు చౌరస్తాలో వర్షపునీరు నిల్వ ఉండటంతో మంగళవారం జరిగిన వారాంతపు సంతలో కూరగాయల క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. తైబజారు వసూలు చేసిన మున్సిపల్ అధికారులెవ్వరూ పట్టించుకోకపోవడంతో ప్రత్యామ్నాయ పరిస్థితులు లేక బురదనీరు, చిత్తడి ఆవరణలో కూరగాయలు పెట్టుకుని విక్రయించారు. వినియోగదారులు నడవ టానికి అవకాశం లేకపోవడంతో నానాతంటాలుపడ్డారు. చౌరస్తా ఆవరణ ఎత్తులేపడంతో చిన్నపాటి వర్షం కురిసినా అంబేడ్కర్ కూడలిలో నీరు నిలిచి చిత్తడిమయమవుతుంది. వరదనీరు మళ్లించే చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. ఈవిషయమై వచ్చే వారంలోగానైనా వారాంతపు సంతలో వరద, బురద కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

ఆ తండ్రి కన్ను మూశాడు..

● ఎట్టకేలకు తలకొరివి పెట్టిన కుమారుడు

కోహెడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వృద్యాప్యం.. పైగా కొడుకు రానంటున్నాడన్న మనో వేదనతో మంచం పట్టిన ఆ తండ్రి మంగళవారం మృతి చెందాడు. కోహెడ మండలం నకిరేకొమ్ముల గ్రామానికి చెందిన కోనేటి కుమార్(70) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. కొడుకు శ్రీకాంత్ పెళ్లి చేసుకొని అత్తగారి ఊరికే పరిమితం అయ్యారు. తండ్రి మంచి చెడ్డలు పట్టించుకోకపోవడంతో కొడుకు మీద బెంగతో అనారోగ్యం పాలై కోమాలోకి వెళ్లి ప్రాణప్రాయ స్థితిలో ఉన్నాడు. తండ్రిని కడసారి చూపు చూసేందుకు రావాలని కులపెద్దలు కొడుకుకు ఫోన్ చేసి కోరినా నేను రాను ఖరాఖండిగా చెప్పినా వైనం తెలిసిందే. . దురదృష్టవశాత్తు కోనేటి కుమార్ మంగళవారం మృతి చెందాడు. దహన సంస్కారాలు తామే చేస్తామని కుల పెద్దలు సంఘటితం కావడంతో కుమారుడు శ్రీకాంత్ వచ్చి తప్పు ఒప్పుకొని తండ్రి అంత్యక్రియలు నిర్వహిస్తానని చెప్పడంతో కుల పెద్దల సమక్షంలో తండ్రికి తలకొరివి పెట్టారు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించింది. జిల్లా పూసల సంఘం అధ్యక్షులు ఖమ్మం వెంకటేశం, పలువురు కుల పెద్దలు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

23న హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

హుస్నాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23వ తేదీన హుస్నాబాద్ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలన్నారు. చివరి కౌన్సెలింగ్ వరకు ఈ కళాశాలలో 65 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఈ నెల 14వ తేదీన విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తుండగా దీనికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతారని ప్రిన్సిపాల్ చెప్పారు. నూతనంగా ఏర్పాటు చేసిన కాలేజీ కావడంతో విద్యార్థులు తక్కువగా జాయిన్ అయ్యారని, ఫీజు రూ. 50 వేలు ఉందని, దీనిని తగ్గిస్తే విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇందుకు మంత్రి పొన్నం ప్రభాకర్, శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు



రన్నింగ్ చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

దౌల్తాబాద్,ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాజులపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయులు త్యాగరాజు ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్, స్కిపింగ్, టగ్ అఫ్‌వార్, మ్యూజికల్ చైర్ తదితర ఆటల్లో ఆనందంగా పాల్గొని ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. అనంతరం విద్యార్థుల తల్లి దండ్రులు మాట్లాడుతూ.చిన్నప్పుడు విద్యార్థి దశలో చదువుకున్న జ్ఞాపకాలను, ఆటల పోటీల్లో సాధించిన విజయాలను విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తు చేసుకున్నారు.

'స్వాహా'కారం..!

(5వ పేజీ తరువాయి..)

అది ముందుకు సాగడం లేదు. దీంతో ఇప్పటి వరకు నిధుల రికవరీ జరగలేదు. హుస్నాబాద్ సీఈవో ఈ ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. దుబ్బాక సీఈవో కూడా నిధుల దుర్వినియోగానికి తనను బాధ్యుడిని చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఆయనను ప్రస్తుతం సస్పెండ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కూడా ఈ అవినీతికి ప్రధాన కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

విచారణలో కాలయాపన

పాలమాకుల సహకార సంఘంలో 2016లో రైతుల పేరుతో బినామీ రుణాల ద్వారా రూ. 26 లక్షలు స్వాహా అయ్యాయి.

ఈ విషయంలో పాలమాకుల కార్యదర్శి ఇప్పుడు కోర్టును ఆశ్రయించారు. మరోవైపు, చేర్యాల సొసైటీలో జరిగిన దుర్వినియోగంపై అధికారులు స్పందించి, రూ. 3.5 లక్షలు రికవరీ చేశారు. సిద్దిపేట సొసైటీ కార్యదర్శి కూడా రూ. 1.60లక్షలు చెల్లించారు. కానీ మిగతా పెద్ద మొత్తాల రికవరీపై మాత్రం శ్రద్ధ చూపడం లేదు.

పాత, కొత్త పాలకవర్గాల అక్రమాలు

గతంలో మాన్యువల్‌గా రుణాలు ఇచ్చేటప్పుడు సహకార సంఘాల్లో భారీగా అవినీతి జరిగేది. పాలకవర్గ తీర్మానాలతోనే అక్రమ రుణాలను మంజూరు చేసి నిధులు స్వాహా చేసేవారు. పాత పాలక మండళ్లు పదేళ్ల కంటే ముందు నుంచి ఇదే పద్ధతిని కొనసాగించాయి.

ప్రస్తుతం రుణాల జారీలో అక్రమాలకు అవకాశం తక్కువగా ఉన్నప్పటికీ, ఎరువులు, ఇతర వ్యాపారాల పేరుతో నిధుల స్వాహా కొనసాగుతోంది. ప్రస్తుత పాలకవర్గంలోని కొందరు అవినీతిపరులు, అధికారులతో కలిసి లక్షల రూపాయలను జేబులో వేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేపటితో పాలకవర్గం గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈ నిధుల రికవరీకి ఎవరు బాధ్యత వహిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

స్పోర్ట్స్ యూనిఫామ్స్ పంపిణీ

నంగునూరు/మర్కుక్/దుబ్బాక, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట- భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి గ్రామంలో మంగళవారం ఉన్నతపాఠశాల విద్యార్థులకు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి స్పోర్ట్స్ యూనిఫాంలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బోలోజు రమేష్ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. నంగునూరు మండలం అప్పలయా చెరువు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 24మంది విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు రవి, భాస్కర్ రెడ్డి స్పోర్ట్స్ డ్రెస్సులను మంగళవారం ఎంఈఓ దేశిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. 125 మంది విద్యార్థుల కోసం స్పందన చారిటబుల్ ట్రస్ట్, లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్, ఎలక్ట్రిసిటీ ఏఈ పటాన్‌చెరు అమరేందర్‌ల సౌజన్యంతో మర్కుక్ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ స్పోర్ట్స్ యూనిఫాంతో పాటు టైబెల్ట్ బ్యాడ్జ్‌లను అందజేశారు.

చీకట్లో మగ్గిన బత్తలవానిపల్లి



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

కోహెడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఈదురు గాలులతో కూడిన వర్షానికి కోహెడ మండలం బత్తులవానిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి విద్యుత్ వైర్ తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో రాత్రంతా గ్రామస్థులు చీకట్లో మగ్గారు. మండలంలో వర్షం కొట్టిందంటే ఇక్కడ వైర్ తెగిందనో, చెట్టు విరిగిపడిందనో, కరెంట్ రావడం లేదనో ఫోన్లు విద్యుత్ అధికారులు, సిబ్బందికి వస్తుంటాయి. అదే వర్షంలో వాళ్లు ఫీల్డ్‌కు వెళ్లక తప్పని పరిస్థితి ఉంటుంది. కోహెడ మండలంలోని నాగసముద్రాల చెరువులోని బత్తులవానిపల్లి గ్రామానికి వెళ్ళవలసిన 11 కెవి విద్యుత్ వైర్ సోమవారం రాత్రి కురిసిన వర్షానికి తెగిపడింది. దీంతో బత్తులవానిపల్లి చీకట్లో మగ్గింది. ఈ విషయాన్ని బత్తులవానిపల్లి గ్రామస్తులు లైన్‌మెన్ హైముద్దీన్‌కు ఫోన్ చేశారు. దీంతో లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్ రాజేందర్‌తో కలిసి చెరువులోకి దిగి ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కి ఎవరు చేయని సాహసం చేసి వైర్లు అతికించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

మహిళా సంఘాలకు శిక్షణ

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తిలో భాగంగా సామాజిక చేకూర్పు, నూతన స్వయం సంఘాల ఏర్పాటు, విభిన్న ప్రతిభావంతుల సంఘాలు, వయోవృద్ధుల సంఘాలు, కిషోర బాలికల సంఘాల ఏర్పాటుపై మహిళా సంఘాలకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు ఇందిరా క్రాంతి పథకం ఏపీఎం బబ్బురు తిరుపతి పేర్కొన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని ఏకేపి కార్యాలయంలో మహిళా సంఘాల ప్రతినిధులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడారు. మహిళా సంఘాల్లో విభిన్న ప్రతిభావంతుల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీబీవో ఆడిటర్ ప్రసాద్, సీసీ అశోక్, ఎంఎస్‌ఏ జితేందర్ 21 సంఘాల పదాధికారులు, వివోఏలు పాల్గొన్నారు.

రైతు బీమా పథకం గడువు పెంచాలి

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని మంగళవారం హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. రైతు బీమాకు కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి బుధవారంతో గడువు ముగుస్తుందని, ప్రస్తుతం రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవ్వడంతో దీని గడువు పెంచాలని కోరారు. రైతు బీమా పథకం రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని, అందరు దరఖాస్తు చేసుకునే విధంగా చూడాలని కోరారు. అలాగే రైతులకు సరిపడా యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారని, యూరియా కోసం ఎరువుల షాపుల ముందు నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు.